ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల వేతనాలు పెంచాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల వేతనాలు పెంచడంతో పాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జాతీయ నేత ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అండ్ అలైడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ... ఈనెల 28న సెక్యూరిటీ గార్డుల జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా అన్ని లెబర్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి అధికారులకు మెమోరాండం సమర్పించినట్లు తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని చెప్పారు. ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వి.మధు, తపన్ గోష్, దిలీప్ దాస్, బుజ్జిబాబు, తుమ్మల సోమయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ డే

కాచిగూడ: ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎన్‌లో పనిచేసిన కాలంలో జరిగిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ రిటైర్డ్ ఎంప్లాయిస్ గత జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, బండి రమేష్, డి.బాలకృష్ణ, శ్రీనివాస్ కుమార్, ఆనంద్ యాదవ్, మోహన్ దాస్, నారాయణ స్వామి, రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల శ్రమను గుర్తించాలి

ప్రొ. శాంతసిన్హా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రామిక మహిళల శ్రమను గుర్తించి సమాన అవకాశాలు కల్పించాలని పద్మశ్రీ, బాల హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ ప్రొ. శాంతసిన్హా అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం అఖిల భారత శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం జరిగింది. 13వ జాతీయ సదస్సును నవంబర్ 1, 2వ తేదీలలో నిర్వహించనున్నారు. సమాన పనికి సమాన వేతనం లభించినప్పుడే మహిళలకు గౌరవం దక్కుతుందన్నారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్.రమ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ఆహ్వాన సంఘం ఏర్పాటు...

శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆహ్వాన సంఘాన్ని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా శాంత సిన్హా, చీఫ్ ప్యాట్రన్‌గా చుక్క రాములు, కోచైర్మన్‌గా పాలడగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్వీరమ, కోశాధికారిగా పద్మశ్రీతో పాటు 60 మందిని ఎన్నుకున్నారు.

20మంది సివిల్స్ అభ్యర్థులకు స్కాలర్‌షిప్

చిక్కడపల్లి: అనుకున్న కళలను సాధించుకోవడానికి ధైర్యం కావాలని గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి అన్నారు. సివిల్స్ సాధించడం సులభతరం కాదని క్రమశిక్షణతో కష్టపడాలని సూచించారు. గ్రాన్యూల్స్ ఇండియా, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించేందుకు విద్యా స్కాలర్‌షిప్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం అశోక్‌నగర్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో 20 మంది సివిల్స్ అభ్యర్థులకు స్కాలర్‌షిప్, పుస్తకాలను అందజేశారు. సివిల్స్ సాధించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాల లత మాట్లాడుతూ... పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే తప్పకుండా సివిల్స్ సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రో టీవీ ఎండీ కొండవీటి విజయప్రసాద్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

చిక్కడపల్లి: వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం తెలంగాణ (గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలో వడ్డెర్ల ఆత్మగౌరవ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్వారీలపై పూర్తి హక్కులను వడ్డెరులకు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారుడు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, నాయకులు మోహన్‌కుమార్, వల్లపు గణేశ్, కృష్ణ, యాదగిరి, ఎల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌కు డాక్టరేట్

అంబర్‌పేట: న్యాయ సలహాదారుడిగా.. వ్యక్తిత్వ వికాస నిపుణులుగా సేవలందిస్తున్న సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌కు లేజండరీ పీస్ అవార్డ్స్ కౌన్సిల్ సంస్థ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఖాదర్‌ను డాక్టరేట్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా ఖాదర్ మాట్లాడుతూ... సమాజానికి మరింత సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. లైఫ్ సైన్స్, ఫిలాసఫీ చదివిన తనకు డాక్టరేట్ రావడం మరింత బాధ్యత పెంచిందన్నారు. మోటివేటర్‌గా తాను యువతలో స్ఫూర్తి నింపేలా సేవలందిస్తానని అన్నారు.

బతుకమ్మ పండుగ నాటికి కుంటను అందుబాటులోకి తెస్తాం

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- చెరువుల అభివృద్ధికి బతుకమ్మకుంట ఓ నమూనాగా మారుతోందని వ్యాఖ్య



బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్ బస్తీలో సమస్యలను తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్



అంబర్‌పేట బతుకమ్మకుంట సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

అంబర్‌పేట: చెరువుల అభివృద్ధికి బతుకమ్మకుంట ఓ నమూనాగా మారుతోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. బతుకమ్మ పండగ సమీపిస్తున్న నేపథ్యంలో చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు ఆయన ఆదేశించారు. బుధవారం అంబర్‌పేట బతుకమ్మకుంటలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచించారు. ఇటీవల జాతీయ స్థాయి బృందం చెరువు పునరుద్ధరణ పనులను పరిశీలించి వెళ్లిందన్నారు. ఇది అందరికీ నమూనాగా నిలిచేలా తీర్చిదిద్దామని ఆయన పేర్కొన్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు అందమైన మొక్కలను నాటాలన్నారు. వర్షపునీరు చెరువులో చేరినా సాఫీగా బయటకు వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలన్నారు. ప్రజలందరికీ ఆహ్లాదం పంచేలా కుంటను తీర్చిదిద్దామన్నారు. బతుకమ్మ పండుగ నాటికి కుంటను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, స్థానికులు ఉన్నారు.

శ్రీరాంనగర్‌బస్తీ ముంపు సమస్యపై ఆరా...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇటీవల కురిసిన వర్షాలకు ముంపుబారిన పడ్డ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్ బస్తీని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. వర్షపు నీటితో పాటు మురుగు ముంచెత్తడానికి గల కారణాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్‌సాగర్ ఔట్‌లెట్ నాలాను కలుపుతూ 30 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్ బ్లాక్ అవ్వడంతో ఈ సమస్య తలెత్తిందని అధికారులు ఆయనకు తెలిపారు. ఇక్కడ ఖాళీ ప్రదేశంలో బోర్ వేసినప్పుడు పైపులైన్ దెబ్బతిందని పేర్కొన్నారు. దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని హైడ్రా కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారితో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంరక్షకులకు స్వాంతన ఏది.?

ముషీరాబాద్: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు (దివ్యాంగులు) వారి సంరక్షకులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఎస్ఎంఐసీఏ అధ్యక్షుడు మంద రామ్మోహన్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిర్దిష్ట విధాన మద్దతు కోసం ఒత్తిడి చేయడమే లక్ష్యంగా ఈనెల 23వ తేదీన ఉదయం 10.30లకు ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల కేసుల్లో ఆస్పత్రులు నగదు రహిత చికిత్సలకు ఇన్సూరెన్స్ కంపెనీలు మొండిచేయి చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా రూ.20లక్షలకు ఆరోగ్య బీమా తీసుకుంటున్నా డబ్బులు చెల్లించి డిశ్చార్జి కావాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. రీయింబర్స్‌మెంట్‌లోనూ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపించారు. అమలుకు నోచుకోని నిబంధనల వల్ల సంరక్షకులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



లక్ష్మీగణపతి ఆలయ షెడ్డు నిర్మాణానికి రూ.51వేలను విరాళంగా అందజేస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: దేవాలయాల అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించి సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలో నూతన షెడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ పావని రూ.51వేల విరాళాన్ని ఆలయ ఈఓ లక్ష్మారెడ్డికి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఆలయాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, నేతలు రత్నసాయిచంద్, ప్రకాష్‌యాదవ్, జ్ఞానేశ్వర్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని చేస్తాం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో రాజకీయాలకు అతీతంగా మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని చేస్తామని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి ఆధ్వర్యంలో కన్వీనర్ టి. రమేష్ అధ్యక్షతన హేతువాది నరేంద్ర దబోల్కర్ వర్ధంతిని పురస్కరించుకొని సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశంలో చట్ట సాధనకు తగిన కృషి చేస్తామన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. జాతీయస్థాయిలో చట్టం చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన డిమాండ్ తమకు ఆదేశమని అన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి అన్ని పార్టీల మద్దతుతో చట్టం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మూఢనమ్మకాల నిర్మూలన చట్టానికి సంబంధించిన ముసాయిదాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, మాజీ ఎమ్మెల్సీ కర్ణి ప్రభాకర్, డాక్టర్ జిలకర శ్రీనివాస్, సాంబ శివరావు, పి.శంకర్, వహీద్, జి.ఝాన్సీ స్వరాజ్య లక్ష్మీ ,సైకిలాబ్ బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నర్సింగరావు మృతి బీజేపీకి తీరని లోటు



సింగితం నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు గౌతంరావు

అంబర్‌పేట: దివంగత బీజేపీ నేత సింగితం నర్సింగ్‌రావు మృతి బీజేపీకి తీరని లోటని సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. గోల్నాకలో బుధవారం నర్సింగ్‌రావు 7వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జీ.ఆనంద్‌గౌడ్‌తో కలిసి ఆయన హాజరై నర్సింగ్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ... నర్సింగ్‌రావు పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశానని అన్నారు. మృధు స్వభావిగా ప్రజా సమస్యల పరిష్కారామే ధ్యేయంగా పని చేసేవారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, నాయకులు రవీందర్‌గౌడ్, ఎం.శ్యాంరాజ్, కె.రవీందర్, ఆర్కె రాంచందర్, ఈశ్వర్, కుటుంబ సభ్యులు సింగితం రాజేష్, అరుణ్, అజయ్, కేశవ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతోనే ఎక్కడికక్కడే చెత్త

కవాడిగూడ: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగం డ్రైవర్లను ఇతర విభాగాలకు బదిలీ చేయడంతో నగరంలో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోతోందని.. రాంకీ సంస్థకు చెందిన డ్రైవర్ల సమ్మెతో సమస్య మరింత జటిలమైందని జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ జేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డంపింగ్ యార్డులో బుధవారం పేరుకుపోయిన చెత్తకుప్పలను వారు పరిశీలించారు. రాంకీ డ్రైవర్ల సమ్మె చేస్తున్న సమయంలో జీహెచ్ఎంసీ వాహనాలను నిలిపేయడం వెనుక ఉన్న కుట్రలను ఉన్నతాధికారులు అర్థం చేసుకోవాలన్నారు. ఈ సమస్యపై నగర కమిషనర్, మేయర్ దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, టీఈఏ జేఏసీ నేతలు కె.బాలరాజ్, జహీర్, మెరుగు శ్రీనివాస్, ప్రవీణ్, బల్వంతరెడ్డి, కృష్ణ, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే బ్రిడ్జి మునక

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ముసారంబాగ్ బ్రిడ్జి వద్ద వరద ఉద్ధృతికి కారణమని ఇప్పటికైనా ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం ముసారంబాగ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జి వద్ద ఫ్లైఓవర్ పనులను ప్రారంభిస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కనీసం 10శాతం పనులను కూడా పూర్తి చేయలేదన్నారు. ఇప్పటికైనా బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు విజయ్‌కుమార్, పద్మ వెంకట్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్సై వీరమల్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



ముసారంబాగ్ బ్రిడ్జి వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

వ్యక్తి అదృశ్యం



భీంరావు (ఫైల్)

కాచిగూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక శాస్త్రీ నగర్ ప్రాంతానికి చెందిన భీంరావు (45) అనారోగ్యంతో చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్స చేయించుకుని తిరిగి ఇంటికి వస్తానని చెప్పాడు. 2019లో కరోనా సమయంలో చికిత్స కోసం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఇప్పటి వరకు రాలేదు. వివిధ ప్రాంతాల్లో ఎంత వెదికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య దేవి బుధవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

కవాడిగూడ: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దోమలగూడ పోలీసులు సంయుక్తంగా నిర్వహించి ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 350 గ్రాముల గంజాయిని ఒక కారు, మూడు సెల్‌ఫోన్లు నగదును స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎస్.నిఖిల్(19) విజయవాడ ఆటోనగర్‌కు చెందిన రాఘవేంద్రరావులు ఇందిరాపార్కు చౌరస్తా నుంచి గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, దోమలగూడ పోలీసులు ఏక కాలంలో తనిఖీలు నిర్వహించి వారి వద్ద ఉన్న గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గతంలో స్థానికంగా గంజాయి సేవించే రాఘవేంద్రరావు ఆంధ్ర, ఒడిస్సా బార్డర్ నుంచి గంజాయిని సేకరించి హైదరాబాద్‌లో విక్రయిస్తూ సులభంగా డబ్బులు సంపాదించి జల్సాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై పలు పోలీస్ స్టేషన్లలో క్రిమినల కేసులు నమోదైనట్లు వారు వెల్లడించారు. ఈ కేసును దోమలగూడ పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విలేకరుల సమావేశంలో దోమలగూడ ఎస్సై కె.విజయ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధిక వడ్డీ రుణాలు ఇస్తామని మోసం

వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితుడు యుగేందర్

కవాడిగూడ: రుణాలపై వడ్డీ ఆశజూపి ఇంటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా మూడేళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న సునావత్ యుగేందర్‌ను దోమలగూడ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడకు చెందిన బి.పవన్ అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన వాంగ్ హసింగ్‌కు అనే వ్యక్తులకు ఖమ్మం జిల్లా దేశరాజుపల్లి తండాకు చెదిన సునావత్ యుగేందర్ అధిక వడ్డీలకు రుణాలు ఇస్తామని చెప్పి వారి ఇంటిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇంటికి కేవలం 50 నుంచి 80 లక్షల రూపాయలు చెల్లించి ఆ ఇంటికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను బ్యాంకులో రుణం తీసుకునేందుకు తనఖా పెట్టి దాదాపు రూ.3కోట్ల రుణం పొందాడు. ఇంటి యజమానులకు డబ్బులు చెల్లించకుండా మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడని పోలీసులు తెలిపారు. బాధితులు దోమలగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అతడిపై చీటింగ్ కేసు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి ఒక కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీలు వెంటనే చేపట్టాలి



ఇందిరాపార్కు ధర్నాలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకట్

కవాడిగూడ: మల్టీజోన్ స్థాయి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (హెచ్ఎం) బదిలీలు వెంటనే చేపట్టాలని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో బుధవారం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గెజిటెడ్ హెచ్‌ఎంల ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, అచ్చుతారెడ్డి, కృష్ణచారి, విష్ణువర్ధన్‌రెడ్డి, పీవీఎల్ఎస్ మూర్తి, రత్నాకర్‌రెడ్డి మాట్లాడారు. ఎనిమిదేళ్ల తర్వాత సెప్టెంబర్ 23లో దాదాపు 2వేల మందికి మల్టీజోన్ 1, 2లలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పోస్టింగ్‌లు కల్పించినట్లు తెలిపారు. నూతన మల్టీజోన్ వ్యవస్థ వల్ల జిల్లా స్థాయిలో సీనియారిటీ వ్యత్యాసం వల్ల ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయడం వల్ల ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖలో బదిలీలు నిర్వహించిన తరువాత ఏర్పడ్డ ఖాళీలలో పదోన్నతులు కల్పించే సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 902 ప్రధానోపాధ్యాయ పోస్టులను బదిలీలతో భర్తీ చేసిన తర్వాతే మిగతా వారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ ధర్నాలో వేణుగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకట్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యత లేని ఫుడ్ ఫ్లేవర్స్ తయారీ

రాజ్ ఫ్లేవర్స్ పరిశ్రమను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు





జీహెచ్ఎంసీ, విజిలెన్స్ అధికారులను అడ్డుకుంటున్న పరిశ్రమ నిర్వాహకులు

ముషీరాబాద్: నాణ్యత ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్రత వాతావరణంలో బేకరీ, ఫుడ్‌కు సంబంధించిన ఫ్లేవర్స్ తయారు చేస్తున్న ఇండస్ట్రీపై జీహెచ్ఎంసీ, విజిలెన్స్, ముషీరాబాద్ సర్కిల్ అధికారులు దాడి చేసి ఆ పరిశ్రమను సీజ్ చేశారు. నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని తపాడియా డయాగ్నస్టిక్ సెంటర్ భవనంలో అక్రమంగా రాజ్ ఫ్లేవర్స్ పరిశ్రమ కొనసాగుతోంది. ఈ పరిశ్రమ నుంచి వచ్చే వివిధ రసాయనాల దుర్వాసనలతో తాము తీవ్ర అనారోగ్యం పాలవుతున్నామని పక్కనే ఉన్న పట్టాభి టవర్స్‌లోని ఓ వ్యక్తి జీహెచ్ఎంసీ కమిషనర్, పొల్యూషన్ విభాగం, లా అండ్ ఆర్డర్ పోలీసులు, ముషీరాబాద్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

☛ పరిశ్రమ నిర్వాహకుడైన రాహుల్ తపాడియాకు జీహెచ్ఎంసీ అధికారులు మూడు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఎలాంటి వివరణ ఇవ్వకపోవడంతో బుధవారం మధ్యాహ్నం జీహెచ్ఎంసీ విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాస్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి, ఏసీపీ దేవేందర్, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సాహితీ, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య దాడులు చేసి అందులో తయారవుతున్న ఫుడ్, బేకరీ ఫ్లేవర్లను పరిశీలించారు. అక్కడ ఉన్న అపరిశుభ్రత వాతావరణం తయారు చేయాడాన్ని చూసి అధికారులు ఖంగుతిన్నారు. అధికారులను తనిఖీ చేయకుండా నిర్వాహకులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు వారికి నోటీసులు ఇచ్చి పరిశ్రమను సీజ్ చేస్తున్నామని చెప్పి అందులోని సిబ్బందిని బయటకు పంపించారు.

తలసీమియా వ్యాధిగ్రస్తులకు ఐవీఎఫ్ అండ

ముషీరాబాద్: తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) అండగా నిలిచిందని ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ రక్తవీర్ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురికి ఈ అవార్డులను ప్రదానం చేశామన్నారు. వాటిని డాక్టర్ బాలు, ప్రసాదవర్మ, వెంకట్‌రమణ, శివకుమార్‌లకు లడక్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్‌గుప్తా, ఐవీఎఫ్ అంతర్జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్‌లు ఈ పురస్కారాలను వారికి అందజేశారని తెలిపారు. తలసీమియా వ్యాధితో బాధపడుతున్న నాలుగు వేల మంది చిన్నారుల ప్రాణాలు రక్షించేందుకు రక్తాన్ని సేకరించి బాధితులకు అందజేశామని తెలిపారు. తలసీమియా వ్యాధిగ్రస్తులతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను సైతం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

గాంధీనగర్‌లో కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు చంద్రకళ



అంబర్‌పేటలో శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్



రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివి

దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశాన్ని అందించిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ జయంతిని అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ మాత్రమే పాటుపడుతుందని నాయకులు అన్నారు.

–అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



సుందరయ్య పార్కు చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నగర కేంద్ర గ్రంథాలయంలో నివాళులు అర్పిస్తున్న సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి